

భక్తిశ్రద్ధలతో కురబల మహాదేవర



తలపై కొబ్బరికాయలు కొడుతున్న శివ భక్తులు

వి.కోట మండలం సంతగట్టు సమీపంలో బుధవారం అజ్జబీరేశ్వరస్వామి మహా దేవరను కురబలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజులుగా సంతగట్టు సమీపంలోని ఈశ్వరాలయ పరిసరాల్లో 500 మంది కురబ కులస్తులు గుడారాలు, చలువ పందిళ్లు వేసుకుని దేవరకు సిద్ధమయ్యారు. ఈ మూడు రోజులూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరెద్దుకు పూజలు నిర్వహించి చివరి రోజు దేవరను ప్రారంభించారు. శివమాలను ఆచరించిన కురబ భక్తుల తలలపై స్వామిజీ కొబ్బరి కాయలు పగులగొట్టే క్రతువు భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. వేడుకలను తిలకించేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- వి.కోట, ఆంధ్రజ్యోతి



అజ్జబీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా లక్ష కుంకుమార్చన





లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు - ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏడాదికి ఒకసారి జరిగే లక్ష కుంకుమార్చన బుధవారం ప్రారంభమైంది. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘమాసం సందర్భంగా కొండపై ఉన్న డార్మెటరీ హాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తిని, శ్రీచక్రాన్ని ప్రత్యేకంగా అలంకరించి, కళశస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి వెండి ప్రతిమకు ఉభయదారులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గణపతి, ఆదిత్య, నవగ్రహ, చండీహోమాలను నిర్వహించారు. ఉభయదారులకు అమ్మవారి తీర్థప్రసాదాలను ఈవో ఏకాంబరం అందజేశారు.

- చౌడేపల్లె, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు టెన్షన్ లేకుండా

చదువుకుంటున్నాం

- మంత్రి లోకేశ్ ఎదుట పద్మావతి వర్సిటీ విద్యార్థినుల ఉద్వేగం
- ఇంజినీరింగ్ విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వస్తాయో.. రావో అనే ఆందోళనతో గత ప్రభుత్వ హయాంలో చదువుపై దృష్టి పెట్టలేకపోయాం. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిల్లేకుండా రియంబర్స్‌మెంట్ జమ చేస్తున్నారు. అందుకే ఎలాంటి టెన్షన్ లేకుండా ఇప్పుడు మేము చదువుకుంటున్నాం' అన్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎదుట విద్యార్థినులు చెప్పిన మాటలివి. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలోని బీటెక్ ట్రిపుల్‌ఈ మూడో సంవత్సర విద్యార్థినుల తరగతి గదిని మంత్రి లోకేశ్ సందర్శించారు. బోధనా ప్రమాణాలు ఎలా ఉన్నాయని మంత్రి అడగ్గా.. బాగున్నాయంటూ విద్యార్థినులు చెప్పారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ రియంబర్స్‌మెంట్ బకాయిలనూ విడుదల చేస్తామన్నారు. వర్సిటీకి అవసరమైన క్రీడా సామగ్రి సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిపై విద్యార్థినులు ఆనందం వ్యక్తంచేశారు.

5 లక్షలతో డ్రోన్ తయారు చేస్తున్నాం

పద్మావతి వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ (టీబీఐ), ఐటీ, లైఫ్ సైన్సెస్ ల్యాబ్‌లను మంత్రి లోకేశ్ పరిశీలించారు. 2.5 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే డ్రోన్‌ను తాము కేవలం రూ.5 లక్షలతో తాము తయారు చేస్తున్నట్టు అక్కడి నిపుణుల తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు గతంలో చేపట్టిన జ్ఞాన భేరి కార్యక్రమం సందర్భంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. రూ.40 లక్షల దాకా స్టార్టప్‌లకు ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 26 మందికి ఇచ్చామనీ, త్వరలో మరో 14 మందికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇన్నోవేషన్స్, స్టార్టప్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో పని చేస్తున్నట్టు మంత్రికి వివరించారు. సోలార్ ఫోన్, ఛార్జర్, వాటర్ బాటిల్స్ వ్యర్థాలతో బ్యాగుల తయారీ, అరటిపండు తొక్కతో శాలువా, హెర్బల్ శానిటరీ న్యాప్‌కిన్స్ వంటి ఆవిష్కరణలను మంత్రి పరిశీలించారు.

● బీటెక్ ఈఈఈ మూడో సంవత్సరం తరగతి గది వద్దకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్.. క్లాస్‌లోని అధ్యాపకురాలి అనుమతి తీసుకొని లోపలకు వెళ్లారు. తన తోపాటు వీసీ, రిజిస్ట్రార్, కలెక్టర్, మీడియా ఉంటే విద్యార్థినులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోలేరని భావించి.. అందరినీ బయటకు పంపేశారు. ● ఇంజినీరింగ్ కాలేజీ నుంచీ వెనుదిరిగే క్రమంలో వివిధ సమస్యలపై కొందరు బయటివారూ వినతిపత్రాలతో అక్కడికి వచ్చారు. ఇది యూనిర్సిటీ. ఈ అంశాలకు సంబంధించిన వినతిపత్రాలే ఇవ్వాలన్నారు.

● ఓ విద్యార్థిని కోరిక మేరకు ఆమె తండ్రితో వీడియో కాల్‌లో మంత్రి లోకేశ్ మాట్లాడారు. మీ బిడ్డను బాగా చదివించాలనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



ఇండోర్ స్టేడియం ప్రారంభం

శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో రూ.7.5 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన అధునాతన ఇండోర్ స్టేడియంను బుధవారం మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ఏరోబిక్స్ తైక్వాండో, యోగా, ధ్యాన కేంద్రాలను, సబ్ స్టేషన్-3 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి కాసేపు షటిల్ ఆడారు. యూనివర్సిటీలోని క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని కోరారు. ఇటువంటి అధునాతన ఇండోర్ స్టేడియం నిర్మించడం వల్ల క్రీడాకారులకు మంచి ప్రయోజనం కలుగుతుందని క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రీడా సదుపాయాలను విద్యార్థినులు వినియోగించుకోవాలని వీసీ ఉమ, శాప్ ఛైర్మన్ రవి నాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఎండీ గిరీషా, కలెక్టర్ వెంకటేశ్వర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, బల్లి కళ్యాణ చక్రవర్తి, ఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, తిరుపతి కమిషనరు మౌర్య, పద్మావతి వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ శారా సరోజిని, పీఆర్వో శ్రీరజని, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం



ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. పది రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఈ ఏనుగు దేవళంపేట పంచాయతీ పరిధిలోని సూరప్పచెరువు నుంచి మంగళవారం రాత్రి కుమ్మరిపల్లి మీదుగా కల్లూరు-3 సచివాలయం వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి కల్లూరులోని మల్లికార్జుననాయుడు కోళ్లఫారం వద్దకు చేరుకొని అరటి, బొప్పాయి చెట్లను ధ్వంసం చేసింది. సమీపంలో వున్న కట్టకిందపల్లిలో కేశవులు నాయుడికి చెందిన వరి, కోటపల్లిలోని వీరభద్రనాయుడు, శారదమ్మ, వెంకట్రామనాయుడు, చిన్నన్న, జూపల్లి చంద్ర, కల్లూరు సయ్యద్‌బాషాకు చెందిన వరి పంటలను తొక్కేసింది. అక్కడ నుంచి చింతలవంక అడవిలోకి చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు. పంటలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పరిశీలించారు.

ఫ్లిక్స్ బస్సులో బంగారం చోరీపై కేసు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బస్సు డిక్కీలో పెట్టిన బంగారం చోరీపై చిత్తూరు తాలూకా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ మల్లిఖార్జున కథనం మేరకు.. చిత్తూరు సంతపేట దుర్గాదేవి కాలనీలో నివాసముండే రమాదేవి ఈ నెల 1వ తేదీన కృష్ణా జిల్లా పెనమలూరులో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లింది.తిరిగి ఈ నెల 15వ తేదీన చిత్తూరుకు ఫ్లిక్స్ బస్‌లో బయలుదేరింది. తనతో తెచ్చుకున్న రెండు బ్యాగుల్లోని ఒక బ్యాగులో ఐదు సవర్ల బంగారు నగలను పెట్టి బస్సు డిక్కీలో పెట్టింది. ఈ నెల 16వ తేది ఉదయం 6 గంటలకు మురకంబట్టు వద్దకు బస్సు వచ్చింది. ఆ సమయంలో బస్సు డిక్కీలో పెట్టిన బ్యాగులు కనపడకపోవడంతో క్లీనర్ శివ, డ్రైవర్లు కరీముల్లా, సురేష్‌లను ఆమె నిలదీసింది. దాంతో వారు బస్సు ఎక్కించుకుని.. పోయిన నగలతో తమకు సంబంధం లేదని చెప్పి రమాదేవిని బెంగళూరులో దించేశారు. అక్కడినుంచి రమాదేవి చిత్తూరుకు చేరుకుని క్లీనర్, ఇద్దరు డ్రైవర్లపై ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆలయాల సదస్సు ముగింపు సభలో ప్రముఖులతో రాష్ట్ర మంత్రులు లోకేశ్, సత్యప్రసాద్ తదితరులు

ఐటీసీఎక్స్ నిర్వహణతో పెరిగిన తిరునగరి ఖ్యాతి

ముగిసిన అంతర్జాతీయ ఆలయాల సదస్సు

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గత సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన అంతర్జాతీయ ఆలయాల సదస్సు బుధవారం అంతే ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా హిందూ మతానికి సంబంధించిన ఆలయాలు, సంస్థల నుంచీ పెద్ద సంఖ్యలో ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.దేశవిదేశాల నుంచీ హిందూ సమాజ ఉన్నత స్థాయి వ్యక్తుల రాక సదస్సు స్థాయిని చాటి చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వారి సందేశాలతో సదస్సు ప్రారంభం కాగా దేశంలోనే పేరుమోసిన వారణాసి, అయోధ్య వంటి ఆలయాల నిర్వాహకులు, పలువురు పీఠాధిపతులు రావడం సదస్సుకు నిండుదనాన్ని సంతరించిపెట్టింది. మరోవైపు ఏపీ, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు మంత్రులు, దేవాదాయ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరు కావడంతో రాజకీయ సందడి నెలకొంది. ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులైన ప్రముఖుల ప్రసంగాలు ఆహూతులకు విజ్ఞానాన్ని పంచగా సదస్సులో సాగిన చర్చలు ఆసక్తి రేపాయి. అలాగే సదస్సు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రధానంగా పలు ఆలయాల చరిత్ర, సమాచారాలతో పాటు ఆలయాల నిర్వహణతో ముడిపడిన టెక్నాలజీని పరిచయం చేశాయి.

సదస్సు తీరుపై అసంతృప్తులూ వున్నాయి

తిరుపతిలో ఎంత గొప్పగా ఐటీసీఎక్స్ సదస్సు నిర్వహించినా స్థానికులతో పాటు సామాన్యులకు ప్రవేశం లేకపోవడం అసంతృప్తిని మిగిల్చింది. సదస్సులో అనేక దేశాలకు చెందిన ఆలయాల నిర్వాహకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, దేశంలోని వివిధ స్థాయిల్లో వున్న వీవీఐపీల రాక కారణంగా భద్రతాపరంగా సదస్సు నిర్వహణలో ఆంక్షలు, పరిమితులు ఎక్కువగా కనిపించాయి. కేవలం పాస్ జారీ చేసిన ప్రతినిధులను మాత్రమే పరిమితంగా అనుమతించారు. అందువల్ల సదస్సుకు హాజరు కావాలన్న ఆసక్తి ఎంతోమందికి వున్నా హాజరు కాలేకపోయారు. దానికి తోడు ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితులైన అనేక హిందూ మఠాధిపతులు, పీఠాధిపతులు సదస్సుకు రాకపోవడం కూడా వెలితిగా అనిపించింది. వారిని భాగస్వామ్యం చేసివుంటే బాగుండేదన్న భావన జనంలో కనిపించింది. సదస్సు లక్ష్యం సనాతన ధర్మ వ్యాప్తి, పరిరక్షణ అయినప్పుడు ఇలా పరిమితులతో సదస్సులు నిర్వహిస్తే ఆ లక్ష్యం ఎలా నెరవేరుతుందని, ప్రస్తుత యువతరానికి సదస్సు సందేశం ఎలా చేరుతుందని జనం ప్రశ్నించడం వినిపించింది.

మన శివాలయాలు

మొగిలిలో భక్తి పరిమళాలు



ఆలయ గోపురం

భక్తుడైన మొగిలప్ప పేరు మీద కొలువుదీరాడు మొగిలీశ్వరుడు. నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచే శివయ్యకు నిరుపేద భక్తుడే తొలిపూజలందించాడని ఐతిహ్యం. ఈ శివాలయానికి సాక్షాత్తూ మహావిష్ణువు క్షేత్రపాలకుడని చెబుతారు. అందుకే హరిహర క్షేత్రంగా పేరుగాంచింది.

- బంగారుపాళ్యం, ఆంధ్రజ్యోతి

బంగారుపాళ్యం మండలం మొగిలిలో. అతిపురాతనమైనది మొగిలీశ్వరుడి ఆలయం. కౌండిన్య నది పరివాహక ప్రాంతంలో స్వయంభువుగా మొగిలీశ్వరుడు లింగరూపంలో ఉద్భవించాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ పేరు వెనుక ఓ ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది. ఆలయ ప్రాంతంలో మొగలి పొదలెక్కువగా ఉండేవి. ఇక్కడికి సమీపంలో నిరుపేద ఇంట మొగిలప్ప పుట్టాడు. పశువులను మేపుతున్న ఇతడికి మొగిలిపొదల్లోని చెలమ దగ్గర నీటి ధార సరిచేసే క్రమంలో రాతి శబ్దం వినిపించింది. గ్రామస్తుల సాయంతో తవ్వగా శివలింగం బయటపడిందంటారు. ఆ శివలింగానికి మొగిలప్ప రోజూ పూజలు చేయడంతో మొగిలీశ్వర క్షేత్రంగా స్థిరపడిందని చెబుతారు. శివారాధకులైన చోళరాజులు ఇక్కడ కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామికి ఆలయం నిర్మించారని తెలుస్తోంది. ఆలయ చరిత్రను తెలిపే శిలాశాసనం ఉత్తరవైపు బలిపీఠం సమీపంలో ఉంది. సమీపాన రోడ్డుపక్కనే మరో శాసనం ఉంది.



శిలాశాసనం


దినదినాభివృద్ధి

మొగిలి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడి శంకరుడు నిత్యార్చనలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ దివ్య క్షేత్ర దర్శనానికి కర్ణాటక,తమిళనాడు నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. ఏటా శివరాత్రి సందర్భంగా పది రోజుల పాటు ఘనంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 23న అంకురార్పణతో శివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయి. 26న ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం జరుగుతుంది. అనంతరం మొగిలీశ్వరస్వామి వృషభవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. మార్చి5న తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. మొగిలి దేవాలయానికి అనుబంధంగా ఉన్న దేవరకొండ, త్రిశూలతీర్థం,విభూతికొండలను కూడా భక్తులు దర్శించుకుంటారు.



మొగిలిలో స్వయంభువుగా వెలిసిన మొగిలీశ్వరుడు

ఆలయ ప్రత్యేకతలు



కామాక్షి దేవి

- ప్రతి సోమవారం ఉదయం 7-9 గంటల మధ్య రాహుకాల సమయంలో ప్రత్యేక సర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తారు.
- మహిళలు త్రిశూల తీర్థంలో స్నానం చేసి తడివస్త్రాలతో అంగప్రదక్షిణ చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకుంటారు. ఇలా చేస్తే సంతానప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు.
- పర్వదినాల్లో కల్యాణోత్సవాలు జరుగుతుంటాయి.



భక్తులకు భరోసా టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్

● మంత్రి వాసంశెట్టి సుభాష్

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయాన్ని సందర్శించే భక్తుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం స్వామిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది భక్తులకు భరోసా ఇస్తుందన్నారు. 99.6 శాతం పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా శ్రీవారి ప్రసాదాల నాణ్యత పెంపు, పరిశుభ్రత చాలా పకడ్బందీగా జరుగుతోందన్నారు. కాగా శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్ మహాద్వారం గేటు నుంచి కాకుండా బయోమెట్రిక్ నుంచే వెలుపలకు రావడం విశేషం.

→ బయోమెట్రిక్ నుంచి ఆలయం వెలుపలకు వస్తున్న మంత్రి సుభాష్



సురుటుపల్లిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

నాగలాపురం, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ధ్వజస్తంభం వద్ద పంచ మూర్తుల ఉత్సవర్లకు అభిషేకాధి కార్యక్రమాలను చేపట్టారు. యాగశాల మండపంలో వృషభయాగం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపి నందీశ్వరుడి చిత్రంతో ఏర్పాటు చేసిన ధ్వజపటానికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. తద్వారా శివరాత్రి ఉత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు.

— ధ్వజ పటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు —

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,427

తలనీలాలు సమర్పించినవారు: 21,066



భక్తుల కొంగు బంగారం



శ్రీకాళహస్తిలోనే కాదు భట్లకనువూరులోనూ కాళహస్తీశ్వరుడు కొలువుదీరి నిత్య పూజలందుకుంటున్నాడు. ఆధ్యాత్మిక వెలుగులు పంచుతున్నాడు. 1246లో ఈ దేవాలయాన్ని చోళుల చివరి రాజైన రాజేంద్ర చోళ-3 హయాంలో అరవభూమి రెడ్ల వంశస్తులు నిర్మించారని చెబుతారు. అప్పట్లోనే ఆలయ నిర్వహణకు లోటుపాట్లు రాకుండా 80 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు.

- ఓజిలి,ఆంధ్రజ్యోతి

శివరాత్రి వేడుకలకు సిద్ధం : ప్రస్తుతం జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తే ఆలయంలో నిత్యారాధనలు,జరుగుతున్నాయి. ఇటీవల శైమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఏటా కోనేరులో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 26న శివరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, దేవదాయ అధికారులు, గున్నంరెడ్డి కుటుంబీకులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.

●భట్లకనువూరులో కాళహస్తీశ్వరాలయం


జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానం

నాలుగేళ్లుగా పూర్వ వైభవం : నాలుగు దశాబ్దాల క్రితం వరకు దేవాలయ నిర్వహణ సజావుగానే కొసాగింది. తర్వాత గ్రామంలో వివిధ పరిణామాల నేపథ్యంలో దేవాలయాన్ని పట్టించుకోలేదు. ధూప,దీప, నైవేద్యం పెట్టేవారే కరువయ్యారు. ఆరాధనలు అటకెక్కాయి. జీర్ణాలయంగా మారిపోయింది. ప్రహరీ గోడలు పడిపోయాయి. ధ్వజస్తంభం విరిగిపోయింది. ఈక్రమంలో నాలుగేళ్ల క్రితం గ్రామస్తులందరూ. ఆలయ నిర్వహణపై దృష్టి పెట్టారు. గ్రామానికి చెందిన గున్నంరెడ్డి కుటుంబీకులతోపాటు మరికొందరు దాతలు ముందుకు వచ్చారు. మాన్యం భూములకు క్రమం తప్పకుండా వేలం నిర్వహించారు. ఏటా రూ.5 లక్షల రాబడికి ఆలయం చేరుకుంది. దాతల సహాయం రూ.1.30 కోట్లతో కాళహస్తీశ్వరాలయానికి పూర్వ వైభవాన్ని తెచ్చారు. ఆలయంలో ప్రాంగణంలో చిన్న దేవాలయాలను సైతం నిర్మించారు. దీంతో దేవదాయ శాఖ సీ కేటగిరీల ఆలయంగా తన పరిధిలోకి తీసుకుంది.

టీచర్ల సీనియారిటీ జాబితా మరింత ఆలస్యం..!

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): టీచర్ల సీనియారిటీ తుది జాబితా మరింత ఆలస్యం కానుంది.జాబితాపై మూడు వారాలుగా ఎనిమిది బృందాలు కసరత్తు చేసి ఈనెల 13వ తేదీ నాటికి పూర్తి చేశాయి కానీ ఆపై ఈ సమాచారాన్ని టీఐఎస్‌తో సరిపోల్చే క్రమంలో ఎదురైన తేడాలు విద్యాశాఖ అధికారులకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయి. సీనియారిటీ జాబితా తయారీకి ముందు నెల రోజుల పాటు టీచర్లు వారి సర్వీసుకు సంబంధించిన సమాచారాన్ని టీఐఎస్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయా టీచర్లు టీఐఎస్ యాప్ ద్వారా వారి సర్వీసు వివరాలను నమోదు చేశారు. టీచర్లు టీఐఎస్‌లో చేసిన, అక్కడ చోటు చేసుకున్న పొరబాట్ల కారణంగా విద్యాశాఖ అధికారులు నమోదు చేసిన వివరాల మధ్య తేడాలు కనిపించాయి.ఇది కాకుండా హెచ్ఎంలు పాఠశాల స్థాయిలో టీచర్ల సీనియారిటీ వివరాలు నమోదు చేసి ఎంఈవోల లాగిన్‌కు, ఆపై డీఈవో లాగిన్‌కు పంపడంతో అక్కడి ప్రత్యేక టీం సభ్యులు ఎంఈవోలు పంపిన టీచర్ల వివరాలు, రికార్డులను పునఃపరిశీలించినా, తుది జాబితాకు మరింత సమయం పట్టనుంది.

బెయిల్‌పై చింటూ విడుదల

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు మాజీ మేయర్ దంపతుల హత్యకేసులో ప్రధాన నిందితుడిగా వున్న శ్రీరామ చంద్రశేఖర్ అలియాస్ చింటూ బుధవారం ఉదయం బెయిల్‌పై విడుదలయ్యారు. 2015 నవంబరు 17వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయంలో అప్పటి మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ హత్యకు గురయ్యారు. ఈ కేసులో చింటూతో పాటు మరో 22మందిపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ చింటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఈనెల 7వ తేదీన బెయిల్‌ను మంజూరుచేసింది. ఇదిలా వుండగా బుధవారం ఉదయం 6.40 గంటలకు చిత్తూరు సబ్‌జైలు నుంచి చింటూ విడుదలయ్యాడు. విడుదలైన వెంటనే కాణిపాకానికి వెళ్ళి, తిరిగి కోర్టు వాయిదాకు వచ్చి సాయంత్రం తిరుపతికి వెళ్ళాడు.

ఎన్నికల గౌరవ వేతనం మంజూరు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన అధికారులకు, సిబ్బందికి ఒకనెల గౌరవ వేతనం కింద రూ.1.44 కోట్లు మంజూరైంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

టెన్త్ బాలిక మృతిపై డీఎస్పీ విచారణ

పలమనేరు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) :పలమనేరు మండలంలో మోసగాళ్ల మాటలు నమ్మి గర్భందాల్చి అనారోగ్యంతో మృతిచెందిన 10వ తరగతి విద్యార్థిని కేసుకు సంబంధించి పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ స్వయంగా విచారణ ప్రారంభించారు.బాలిక చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయులను విచారించడంతో పాటు బాలిక తల్లిదండ్రులను సైతం విచారించారు. బాలికతో సన్నిహితంగా ఎవరెవరు మెలిగే వారు, అందులో మంచినడవడిక లేని వ్యక్తులు ఎవరైనా ఉన్నారా తదితర వివరాలు అడిగి తెలుసుకొన్నారు.ఇద్దరు గ్రామస్తులపై కూడా బాలిక తల్లిదండ్రులు కూడా అనుమానం వ్యక్తం చేయడంతో వారి కోసం వెతకడం ప్రారంభించారు. ఒకటి రెండు రోజుల్లో నిందితులను అరెస్టుచేసే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.విచారణలో సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ కూడా పాల్గొన్నారు.

తుడాపై మంత్రి నారాయణ సమీక్ష

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అధికారులతో మంత్రి నారాయణ బుధవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్షించారు. తుడా రెవెన్యూ, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మడం ద్వారా ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాల న్నారు.తుడా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న 13 అంతస్థుల తుడా టవర్స్ పనులపైనా మంత్రి ఆరా తీశారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను అధికారులతో కలసి ఆవిష్కరించారు.పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, తుడా వీసీ మౌర్య, ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత హాజరయ్యారు.

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టండి

● కష్టపడ్డ కార్యకర్తను కాపాడుకుంటాం ● అలకలతో ఏమీ సాధించలేం ● పార్టీ శ్రేణులకు టీడీపీ యువనేత లోకేశ్ దిశానిర్దేశం



తిరుపతి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తొలిసారిగా తిరుపతిలో అర్ధరోజు పాటు పార్టీ శ్రేణుల కోసం కేటాయించారు. బుధవారం తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన కపిలతీర్థం పక్కనున్న పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటరు వెరిఫికేషన్, మన టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. వారి మాటలను సావధానంగా విన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తున్న నాయకులకు చురకలంటించారు. తిరుపతి నియోజకవర్గంలో ఇప్పటికైనా అలకలు విడిచిపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం రెండూ అనుసంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమను గుర్తించడంలేదని చాలామంది తనదృష్టికి తీసుకొస్తున్నారని, సీనియర్లు, జూనియర్లు అని లేకుండా పనిచేసినవారందరినీ సమానంగా గౌరవిస్తామన్నారు. పార్టీలేకపోతే ఇక్కడ మనమెవరూ లేరన్న విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతి నేతలు ఆ విషయం తెలుసుకోవాలన్నారు. అధికారం వచ్చేసింది కదా...తిరుగులేని ధోరణితో ఉండడం సరికాదన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలన్నారు.. వైసీపీ పెట్టిన అక్రమ కేసులు ఉన్నవారు భయపడొద్దని, త్వరలోనే వాటిని కొట్టివేయడం జరుగుతుందన్నారు. పార్టీ ఏకార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తప్పుచేసిన వైసీపీ వాళ్లకు చట్టప్రకారం శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. ప్రతిపక్షం చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో మమేకమైతేనే క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుస్తాయన్న స్పష్టతకు అధిష్ఠానం ఇప్పటికైనా వచ్చిందని పార్టీ శ్రేణులు భావించాయి.

పనికోసం పోతే పార్టీలోకి రమ్మన్నారు

ఏదైనా కాంట్రాక్టు పనులు ఇప్పించమని కూటమి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళితే జనసేన పార్టీలో చేరమని ఒత్తిడిచేశారని, అప్పుడు పనులు కూడా ఇస్తామని చెప్పారని ఓ మహిళా నేత లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. కూటమి పార్టీలు కలిసిమెలిసి ఉండాలని ఇలాంటి వాతావరణం ఉండకూడదని చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పక్కనే ఉన్న ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచించినట్లు సమాచారం. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని, ఒకరిదగ్గరకు వెళితే మరొకరికి కోపం వస్తోందని కార్యకర్తలు వాపోయారు. 'మీ పనితీరు ఏంటో మా దగ్గర ఉంటుంది. మీకు ఏవిధంగా న్యాయం చేయాలో పార్టీ చూసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. 'నరసింహ యాదవ్‌కు రాష్ట్ర పదవి వచ్చింది. రాష్ట్రమంతా తిరగాలి. అందరికీ అందుబాటులో ఉండాలి' అని చెప్పారు.

కార్పొరేటర్లతో సమావేశం

ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం కోసం పనిచేసిన కార్పొరేటర్లు లోకేశ్ కలిశారు. టీడీపీ అభ్యర్థిని ఎన్నుకున్నందుకు అభినందించారు. అందరూ కలసి అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకుని నగరాభివృద్ధికి కృషిచేయాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు సూచించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మంచివ్యక్తిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని ఈసందర్భంగా చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు, మబ్బు దేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అంటే అట్లుంటది

'వాట్ సత్యన్న (జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్) తలపై వెంట్రుకలు ఊడిపోయినట్టున్నాయ్? తిరుపతి జిల్లా బాధ్యతలు అంటే అట్లుంటయ్' అని మంత్రి అనగానిని ఉద్దేశించి నారా లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. తాను రెండు జిల్లాల్లో పనిచేసినప్పటికీ తిరుపతి జిల్లాలో పనిచేయడమంటే సవాల్‌గానే ఉందని అనగాని ప్రతిస్పందించడంతో సభలో నవ్వులు విరిశాయి. 'తిరుపతి అంటే అట్లుంటది' అని అక్కడివారు గుసగుసలాడుకోవడం కనిపించింది.

టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో అభిప్రాయాలను తెలుసుకుంటున్న లోకేశ్



చిన్నశేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం



చిన్నశేష వాహనంపై కల్యాణ వెంకన్న - హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారు ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తి మురళీకృష్ణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి పట్టు పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో శోభయమానంగా సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై అధిష్ఠించారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు కదులుతుండగా మేళతాళాలు, మంగళ, కేరళా వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామ స్మరణల మధ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం ఊంజల్ సేవలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపుపందిర వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.



శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అదజేస్తుంటారు. అదే క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా బుధవారం గురుప్రసాద్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకుని ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని గురుప్రసాద్ తెలిపారు.

వెలుగుల శ్రీకాళహస్తి



జలవినాయకుడి కూడలి వద్ద నటరాజస్వామి విద్యుత్ దీపాలంకరణ - విద్యుత్ దీపాలంకారంతో మెరిసిపోతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం



విద్యుద్దీపాల వెలుగులో శ్రీకాళహస్తి క్షేత్రం మెరిసిపోతోంది. శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో.. రెండు రోజుల ముందే విద్యుత్తు దీపాల అలంకరణ పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో దేవతామూర్తుల కటౌట్లు, పట్టణమంతా శోభాయమానంగా మారింది. ఆలయ పరిసరాలు, స్వర్ణముఖి నదిపై వంతెనలు వెలిగిపోతున్నాయి. ఉత్సవాల అంకురార్పణకు సమయం ఆసన్నం కావడంతో తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


శ్రీకాళహస్తీశ్వరాలయం, శివపార్వతుల విగ్రహాలు - రామసేతు వంతెన వద్ద వినాయకుడి విద్యుత్ దీపాలంకరణ










మంచు కురిగే కాలం..







రాత్రంతా కురిసీ కురిసీ ఇక కురవలేక అలసిపోతాయి చూడు..

అప్పుడు ఇలా... మంచు ముత్యాలు పూలను ప్రియమారా ముద్దాడుతాయి. తలిరాకులను లేలేతగా తాకి అలవోకగా జారుతాయి. వణకని ఆవులను చూసి వెనకే నక్కుతాయి. అవ్వ ముట్టించిన పొయ్యి చుట్టూ చేరిన ఇంటిల్లిపాదినీ చూసి కొంటెగా నవ్వుతాయి. అప్పుడిక ఇళ్ల కప్పులమీదకు ఎక్కిన కోళ్లు కొక్కొరొక్కో మంటూ సూర్యుడిని పిలుస్తాయి. పల్లె ఆలయం సుప్రభాతంతో స్వాగతం పలుకుతుంది. మొక్కల వెనుక నుంచి ఎర్రనయ్య బద్ధకంగా బయటకొస్తాడు. చెట్ల చాటునుంచి తళుకుమంటాడు. పూలు కిలకిలా నవ్వుతూ విరుచుకుంటాయి. ఆకు కింద దాగిన పురుగు ఎండను వెతుక్కుంటూ జరజరా కదులుతుంది. పైరును ముద్దాడిన చినుకులు చుక్కలై మెరుస్తాయి. మంచు దుప్పట్లోకి ఎండాకాలం జొరబడే వేళ.. చిత్తూరు నగర శివారు పల్లెల్లో మంగళవారం ఉదయం కనిపించిన అందాలను ఫోటోపట్టి చిత్తూరు స్టాఫ్ ఫోటోగ్రాఫర్ ఇలా అందిస్తున్నారు..

- కుప్పం/ చిత్తూరు, ఆంధ్రజ్యోతి




దారిద్ర్యరేఖకు దిగువ వున్న వారిని గుర్తించండి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారిని మార్చి 2వ తేదీ నాటికి పీ-4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) విధానం ద్వారా గుర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పీ-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చడానికి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడానికి నిర్వహించనున్న సర్వేపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేర ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు దారిద్ర్య రేఖకు దిగువ వున్న వారిని సర్వే ద్వారా గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలన్నారు. పక్కాగృహం, విద్యుత్ సౌకర్యం, ఎల్పీ గ్యాస్ కనెక్షన్, స్థిర, చర ఆస్తులు లేనివారిని గుర్తించి అర్హులుగా చేర్చాలన్నారు. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వే సమాచారాన్ని అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈ సమీక్షలో సీపీవో సాంబశివారెడ్డి, డీఎల్డీవో రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్, టెన్త్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఒకటో తేది నుంచి 20వ తేదివరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్, సెకండియర్ పరీక్షలకు సంబంధించి 30,652 మంది విద్యార్థులు హాజరౌతున్నట్లు తెలిపారు. ఫస్టియర్‌కు 15,482, సెకండియర్‌కు 15,170 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాలను గుర్తించామని చెప్పారు. టెన్త్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 118 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. 20,954 మంది రెగ్యులర్ విద్యార్థులు, 294 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరౌతున్నారన్నారు. పరీక్షల సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ఉపాధ్యాయులు చీటింగ్‌కు పాల్పడితే వారిపై ఎగ్జామినేషన్ యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షాకేంద్రాల వద్ద, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జవాబు పత్రాల తరలింపునకు పటిష్ఠ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ విధివిధానాలకు సంబంధించి చర్యలు చేపడతారన్నారు. పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన విద్య, రెవెన్యూ, విద్యుత్, పోస్టల్, రవాణా, వైద్య, ట్రెజరీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, ఇంటర్మీడియట్ డీఐవో సయ్యద్ మౌలా, డీఈవో వరలక్ష్మి, డీఎంహెచ్‌వో సుధారాణి, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోధనాభ్యాసన సమస్యల పరిష్కారానికే 'యాక్షన్ రీసెర్చ్'



డైట్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తమ తరగతి బోధనాభ్యాసన ప్రక్రియలో గుర్తించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రణాళిక వేసుకుని, అమలు చేసి, వివరాలను రికార్డు చేయడమే యాక్షన్ రీసెర్చ్ అని కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులకు డైట్‌లో యాక్షన్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం వర్క్‌షాపును ప్రిన్సిపాల్ ప్రారంభించారు. గూగుల్ ఫామ్ ద్వారా నమోదు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయులు తాము నిర్వహించబోయే యాక్షన్ రీసెర్చ్‌కు సంబంధించిన ప్రతిపాదనలకు వర్క్‌షాప్ అనంతరం ఆమోదం పొందవలసి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. తమ తమ పాఠశాలల్లో యాక్షన్ రీసెర్చ్‌కు అనుగుణంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి, ఆ అంశాలపై తయారు చేసిన రిపోర్టును తదుపరి వర్క్‌షాప్‌లో సమర్పించాలన్నారు. యాక్షన్ రీసెర్చ్‌ను విజయవంతంగా పూర్తిచేసిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందిస్తామని ఆయన చెప్పారు. రీసోర్స్ పర్సన్లు డాక్టర్ ప్రభాకర్, చెంగల్రాజు, సునీత, నిర్మల, దేవప్రసాద్, రఫీ, అనిత, నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

సమయపాలన పట్ల నిర్లక్ష్యం వీడండి
ముఖ ఆధారిత హాజరీ తప్పనిసరి

● వైద్యాధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధినిర్వహణలో సమయపాలన పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి చిత్తూరు, పలమనేరు, పుంగనూరు,బంగారుపాళ్యం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో రాత్రివేళల్లో మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది విధుల్లో ఉన్నారో లేదో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ముఖ ఆధారిత హాజరీ తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లతో ప్రతి పీహెచ్‌సీల వారీగా వస్తున్న కేసుల వివరాలు, అందిస్తున్న వైద్యసేవలపై ఇకపై సమీక్షలు ఉంటాయని, ఇందుకు అందరూ సిద్ధం కావాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే కొన్ని పీహెచ్‌సీల్లో నామమాత్రంగా జరుగుతున్నాయని, నిర్లక్ష్యం వీడి సర్వేలు వేగవంతం చేయాలని చెప్పారు. డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు 50 పీహెచ్‌సీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సాయంత్రవేళల్లో సబ్‌స్టేషన్‌లోనే ఉండాలి

● ఏఈలకు ఎస్ఈ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగం అధికంగా వుండే సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఏఈలు సంబంధిత సబ్‌స్టేషన్లు లేదా సెక్షన్ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. బుధవారం చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పీఎం సూర్యఘర్ కోసం చేస్తున్న రిజిస్ట్రేషన్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వీసులు లేని వారిని గుర్తించి సర్వీసులు ఇవ్వాలన్నారు. వేసవిలో విద్యుత్ వాడకం క్రమంగా పెరుగుతోందని, ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా విద్యుత్ బిల్లులో క్యూఆర్ స్కానర్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రవేశపెట్టారని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లును చెల్లించడంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సకాలంలో చెల్లిస్తే సర్ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. బిల్లులు వంద శాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్క్ ఆర్డర్లు పెండింగ్ ఉన్నవారు ఈ నెల ఆఖరులోపు పూర్తి చేయాలని, లేకుంటే సంబంధిత అధికారుల జీతాల జరిమానా కింద రికవరీ ఉంటుందన్నారు. ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈవో రాజీనామా



మనోహర గౌడ్

చిత్తూరు కలెక్టరేట్ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరుజిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో మనోహరగౌడ్ బుధవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. బ్యాంకు స్పెషల్ ఆఫీసర్ అయిన జేసీ విద్యాధరికి రాజీనామా పత్రాన్ని అందజేశారు.కొత్త సీఈవో నియామకం జరిగేంతవరకు కొనసాగాలని మనోహర్‌కు జేసీ సూచించారు.డీసీసీబీలో జీఎంగా వున్న మనోహర్ 2019 డిసెంబరు 30నుంచి మూడు సంవత్సరాల పాటు సీఈవోగా కొనసాగారు.రెండో విడతలో 2022 డిసెంబరు 30 నుంచి సీఈవోగా కొనసాగుతున్నారు.ఇకపై ఆయన డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తారు. కాగా సీఈవో పదవి రేసులో పలువురున్నట్లు తెలిసింది. రేపో, మాపో ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశముంది.

రూ.వెయ్యి కోట్లకు డిపాజిట్ల పెంపు లక్ష్యం: సీఈవో

డీసీసీబీ పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిల్లో రూ.వంద కోట్లను వసూలు చేయడమే లక్ష్యంగా నిర్ణయించామని బ్యాంకు సీఈవో మనోహర గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో పాడు, నిరర్థక (ఎన్పీఏ) ఆస్తుల బకాయిలు రూ.2300 కోట్లుండగా, ఇందులో మార్చినెల ఆఖరినాటికి రూ.వంద కోట్ల వసూళ్లకు ప్రణాళిక రూపొందించామన్నారు.ఇందుకోసం ఐదుగురు బ్యాంకు ఏజీఎం, చీఫ్ మేనేజర్లను రికవరీ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. వీరికి బ్రాంచ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు సహకరిస్తారని పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్లు, సింగిల్ విండో సీఈవోలకు కూడా లక్ష్యాలు నిర్దేశించామన్నారు.బ్యాంకు మనుగడకు డిపాజిట్లు కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుతం డిపాజిట్ల రూపంలో రూ.937 కోట్లు వుండగా, దీనిని మార్చినెలాఖరులోగా రూ.వెయ్యి కోట్లకు పెంచేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు.

నేడు ఏబీసీ సెంటర్ ప్రారంభం



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)ను గురువారం ప్రారంభించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వెహికల్ షెడ్ ఆవరణలో ప్రత్యేక ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముద ఈ సెంటర్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఏబీసీ సెంటర్‌లో బుధవారం కమిషనర్ ఏర్పాట్లను పరిశీలించారు.

కొన్ని భజన సంఘాలైపోయాయి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘమే అని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చెప్పుకొచ్చారు. బుధవారం చిత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు తనపై క్రిమినల్ కేసులు పెట్టారని గుర్తు చేశారు.ఐపీఎస్ అధికారి ఆంజనేయులు తనకు వీడియో కాల్ చేసి ప్రభుత్వంలోని పెద్దల పేర్లు చెప్పి ఉద్యమాన్ని ఆపాలని, ఎస్ఆర్‌కే అనే వ్యక్తి వద్ద లొంగిపోవాలని చెప్పారన్నారు. అయితే ఓ అధికారిగా ఉండి ఇలా మాట్లాడడం తగదని ఆంజనేయులుతో తాను చెప్పానన్నారు.ఉద్యోగులంతా సమస్యల పరిష్కారం కోసం పోరాడి అప్పట్లో క్షతగాత్రులయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని సంఘాలు ప్రభుత్వానికి అనుకూలంగా భజన చేస్తున్నాయి తప్ప ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సంఘ నేతలుగా చలామణి అవుతున్న కొందరికి కోట్లాది రూపాయల ఆస్తి ఎలా వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ట్రిబ్యునల్‌ను విభజన సమయంలో రద్దు చేశారని, దాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ మొత్తం రూ.25కోట్లను గత ప్రభుత్వం స్వాహా చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలను ఎలా చెల్లిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు సత్వరమే పీఆర్‌సీ ఇవ్వాలన్నారు.సంఘ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్,ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు

రామకుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేంద్ర బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఐదో తరగతిలో ప్రవేశం కోరు అభ్యర్థులు ప్రసుత్తం నాలుగో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశం కోరే అభ్యర్థులు పదో తరగతి చదువుతూ ఉండాలని ఆయన తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 6వ తేదీలోపు ఏపీబీఆర్‌జీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఐదో తరగతి అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

జోరుగా మురుగు కాలువల్లో పూడికతీత


మురుగు కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కుప్పం పట్టణంలో మురుగు కాలువల పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన కాలువల్లో ఏళ్లతరబడి పేరుకుపోయిన పూడికను పారిశుధ్య సిబ్బంది వెలికి తీసి శుభ్రం చేస్తున్నారు. పూడిక తీత పనులతోపాటు మరోవైపు మలాథీన్ ఆయిల్ పిచికారీ చేస్తున్నారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఈ పనులు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. కేవలం పది రోజుల వ్యవధిలో పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పనులు సాగుతున్నాయి.

పూల రైతులకు ఉపయోగకరంగా సబ్జీ కూలర్ బాక్సులు



కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పూలు, కూరగాయలు తాజాగా ఉండేందుకు ఉపయోగించే సబ్జీ కూలర్ బాక్సులు మండలానికి చేరినట్లు కుప్పం మండల ఉద్యాన అధికారి డింపు ప్రియ తెలిపారు. ఉద్యానశాఖ కార్యాలయంలో బాక్సులు పని చేసే విధానాన్ని బుధవారం రుకార్డ్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా డింపు ప్రియ మాట్లాడుతూ తమ వద్ద 50 శాతం సబ్సిడీతో ఈ బాక్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. సహజంగా పనిచేసే ఈ సబ్జీ కూలర్ బాక్సుల్లో పూలు, కూరగాయలు ముందు రోజే కోసి ఇందులో నిల్వ ఉంచుకుంటే మరుసటి రోజూ తాజాగా ఉంటాయన్నారు. వాటిని అలాగే మార్కెట్‌కు తీసుకు వెళ్లి విక్రయించుకోవచ్చని చెప్పారు. బాక్సుల్లో ఉంచిన సంపంగి, రోజా తదితర పూలు, కూరగాయలు 48 గంటలపాటు తాజాగా ఉంటాయన్నారు. ఈ బాక్సు వినియోగానికి ఎటువంటి విద్యుత్తు అవసరం లేదన్నారు. బాక్సులో 20 లీటర్లు నీటిని పోస్తే చాలన్నారు. 25 కిలోల సబ్జీ బాక్సు ధర రూ.21 వేలు, 50 కిలోల బాక్సు రూ.39,900, 100 కిలోల బాక్సు ధర రూ.57 వేలు అని వివరించారు. ఏదైనా 50 శాతం సబ్సిడీతో రైతులు తీసుకోవచ్చన్నారు. బాక్సులు కావాల్సిన కుప్పం, శాంతిపురం మండలాల రైతులు ఫోన్ నంబర్ 7731881596 ను సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యసేవలు


మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ కార్మికులకు బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో బీఆర్‌ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, శాంతి డెంటల్ క్లినిక్‌లు కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కుప్పం లయన్స్ క్లబ్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ బీఆర్. సురేష్ బాబు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ ప్రసాద్, కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్, కుప్పం అధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి సెంథిల్ కుమార్, ప్రతినిధులు చరణ్, సెల్వం, శివ, కృష్ణమూర్తి, బాలాజీ, హర్ష, కౌన్సిలర్ దాము, జాకిర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

● మండల పరిషత్తు కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజలు

గుడుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గుడుపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని కాలనీ వాసులు బుధవారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గత నాలుగు నెలల క్రితం మురుగు కాలువ ఏర్పాటు సమయంలో పైపులైన్ తొలగించడంతో నీటి సమస్య నెలకొందని వాపోయారు. కాలనీలో 20 కుటుంబాలు నీటి కోసం గత కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని.. తాగునీటి వసతి కల్పించాలని కోరారు. ఎంపీడీవో రాధాకృష్ణ కార్యాలయంలో లేకపోవడంతో ఫోన్‌లో వారికి నాలుగు రోజుల్లో నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో సీనియర్ సహాయకులు రాజశేఖర్‌కు వినతి పత్రం అందించి విరమించారు.

రైతు సేవా కేంద్రాల పరిశీలన


పలమనేరులో అవగాహన ర్యాలీ

పలమనేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు రాయితీ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ నాగపద్మిని పేర్కొన్నారు. బుధవారం పలమనేరు మండలం కొలమాసనపల్లి, కల్లాడు రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ శాఖ అధికారిణి సంధ్యతో కలిసి సందర్శించారు. రైతులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పిస్తున్న డీపీవో

వి.కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని.. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని చిత్తూరు డీపీవో సుధాకర్‌రావు అన్నారు. బుధవారం వి.కోటలోని సంపద తయారీ కేంద్రం వద్ద 9 మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు చెత్త నుంచి సంపద తయారీ విధానంపై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ పరిధిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో లక్ష్మీ, ఎంపీడీవో ఈశ్వరన్, సర్పంచ్ లక్ష్మీ, ఈవో శివశంకర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నంజంపేట ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం కుసుమాంబ హిందీ భాషా ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు మాలతి, జగన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, స్వాతి, శ్రీదేవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీవాణి తదితరులు

కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. గతేడాది డిసెంబరు 8వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన (ఎన్‌ఎంఎంఎస్) రాత పరీక్షలో 25 మంది కల్లూరు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు సహిస్తా, యస్రబ్ తమ ప్రతిభ కనబరచడంతో ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ. 12 వేలు వంతున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌గా అందించనుంది. బుధవారం స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం


గురుస్వామి దంపతులను సన్మానిస్తున్న కర్ణాటక భక్తులు

కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ములబాగల్ తాలూకా బైరకూరు మండలానికి చెందిన 250 మంది భక్తులు తిరుమలకు కాలినడక పాదయాత్ర చేపట్టారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీలోని గుండాలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు బుధవారం ఉదయం చేరుకున్నారు. భక్తులకు దేవళంపేటకు చెందిన కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు గురుస్వామి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. గురుస్వామి దంపతులను కర్ణాటక భక్తులు సన్మానించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు చంద్రబాబు, వేణుగోపాల్, శ్రీనివాస్, అరుణ, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులు విద్యార్థులకు అవసరం


దస్త్రాలు చూపుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ఒకేషనల్ కోర్సులు అవసరమని మధ్యప్రదేశ్ రాష్ట్రం రాయపూర్ పీఎంశ్రీ కార్యాలయం పరిశీలనాధికారి అజిత్‌మిశ్రా అన్నారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి వివిధ అంశాలపై హెచ్‌ఎం మోహన్‌రెడ్డితో చర్చించారు. 26 మంది వృత్తి విద్య దస్త్రాలు, విద్యార్థుల ప్రదర్శన, విద్యార్థులకు వైవా అంశాలను పరిశీలించి మదింపు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు సాంకేతిక మెలకువలు పాటిస్తే వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్ రైతులకు సూచించారు. మండలంలోని గానుగచింత గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏవో సుధారాణి, సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


కుప్పంలో ర్యాలీ


పుంగనూరులో మానవహారం

కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో కాషాయ జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నరేష్‌తోపాటు సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, మరాఠా యువకులు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఊరేగించారు.

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె పట్టణంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను భజరంగ్‌దళ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

●శాంతిపురం: శాంతిపురంలో కూటమి నేతలు ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాజేంద్ర, కిషోర్ కుమార్, గోపి, కుమార్, రమేష్, సుబ్రహ్మణ్యం, సుధాకర్, హిందూ పరిరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుంగనూరు విశ్వహిందూ పరిషత్, హిందూ జాగరణసమితి, బీజేపీ నాయకులు, హిందూయువత, మహిళలు పాల్గొన్నారు.

అధిక యూరియా వాడకంతో.. భూమి సారహీనం

కుప్పం మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా

ఫటా ఫట్



కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యూరియా వంటి రసాయనిక ఎరువులు అపరిమితంగా వాడటంతో భూమి సారహీనమై ఎందుకూ పనికిరాకుండా పోతుందని కుప్పం మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా అన్నారు. రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు అవవసరమైన అంశాలపై బుధవారం మండల వ్యవసాయాధికారితో 'ఆంధ్రజ్యోతి' చేసిన ముఖాముఖిలో క్లుప్తంగా..!

● **సహజమైన ఎరువులే వాడండి**

ప్రభుత్వం యూరియాకు అత్యధిక సబ్సిడీ ఇస్తోంది. 45 కిలోల బస్తా యూరియా అసలు ధర రూ.1500 అయితే అందులో రూ.1230 సబ్సిడీగా రైతుకు లభిస్తోంది. అంటే రైతులు కేవలం రూ.370 మాత్రమే చెల్లించి బస్తా కొనుక్కోవచ్చు. యూరియా నిల్వలకు కొదవ లేదు. అయితే అధిక సబ్సిడీకి వస్తోందని ఈ రసాయనిక ఎరువును అత్యధికంగా వినియోగిస్తే తాత్కాలికంగా పంట బాగా రాచ్చినా శాశ్వతంగా వ్యవసాయ భూమి సారహీనమై ఎందుకూ పనికిరాకుండా పోతుంది. రసాయనిక ఎరువులకు బదులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే సహజ సిద్ధమైన పచ్చిరొట్ట, వర్మీకంపోస్టు, ఆవుపేడ వంటి ఎరువులు వాడితే భూమిలోని సారం పెరుగుతుంది. పచ్చిరొట్ట దాదాపు యూరియా ఇచ్చే ఫలితాన్నే రైతులకు అందిస్తుంది.

● **నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు**

కుప్పం మున్సిపాలిటీ, మండల పరిధిలో మొత్తం 14 ఎరువులు, వ్యవసాయ మందుల దుకాణాలు లైసెన్సు కలిగినవి ఉన్నాయి. ఇటీవలే జిల్లా వ్యవసాయాధికారులు ఆయా దుకాణాలను తనిఖీ చేసినప్పుడు నకిలీలు ఏవీ వారి దృష్టికి రాలేదు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో చాలా అప్రమత్తంగా ఉన్నాం. ఒకవేళ ఏ దుకాణదారుడైనా నకిలీ ఎరువు, మందులు అమ్మినట్లు రైతుల నుంచి ఫిర్యాదు అందితే వారిపై చట్టపరమైన చర్యలు కచ్చితంగా తీసుకుంటాం.

● **రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించాయి. ప్రస్తుతం రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికి సుమారు 8,700 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. మిగిలిన వారు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో పేర్లను తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, పరిశీలన జరిగి విశిష్ట గుర్తింపు సంఖ్య వచ్చినవారే ఇకపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఏరకమైన సబ్సిడీకైనా అర్హులవుతారు. ఇది గుర్తుంచుకుని రైతులందరూ సహకరించాలి.

వ్యవసాయ సాంకేతిక విధానాలపై సలహాలు తీసుకోండి

మండల పరిధిలో ప్రస్తుతం 4 వేల ఎకరాల వ్యవసాయ భూమి సాగులో ఉంది. వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 1900 ఎకరాల్లో ఉలవలు సాగవుతుండగా.. అత్యల్పంగా జొన్నలు మూడు ఎకరాల్లో వేశారు. మొక్కజొన్న, రాగి, అనుములు, పశువుల మేత సాగులో ఉన్నాయి. ఈ పంట సాగుచేయాలన్నా వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులతోపాటు మందులు, ఎరువులను వాడే శాస్త్రీయ పద్ధతులు తెలియడం అవసరం. అటువంటి పద్ధతుల విషయంలో వ్యవసాయాధికారి, వ్యవసాయ సిబ్బందిని రైతులు సంప్రదించాలి. తాము ఎప్పుడూ వారికి అందుబాటులో ఉంటాం. సూచనలు, సలహాలు పాటించి వ్యవసాయాన్ని చేస్తే రైతులు నష్టం లేకుండా లాభాలతో బయట పడడానికి అధికంగా అవకాశం ఉంటుంది.

కేఈసీలో బీటెక్ ఫలితాల విడుదల


పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న బీసీ నాగరాజ్

కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ హోదాలో జనవరిలో నిర్వహించిన బీటెక్ ప్రథమ సంవత్సరం, ప్రథమ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, జేఎన్‌టీయూ ఎగ్జామినేషన్స్ పరిశీలకులు ప్రొఫెసర్ డాక్టర్ వీబీ.చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె.మాధవన్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ఎం.సోమసుందరం బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ హోదాలో నిర్వహించిన బీటెక్ ప్రథమ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు హర్షం వ్యక్తం చేశారు. విడుదలైన పరీక్ష ఫలితాల్లో కుప్పం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు బీసీ.నాగరాజ్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థి ఎస్‌ఆర్.సుమిత్ర 93.6 శాతం, కేహెచ్.జాహ్నవి పద్మప్రియ 93.5 శాతం , మనోజ్ కుమార్ 92.5 శాతం మార్కులతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. అత్యధిక శాతం విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

చంద్రబాబు పాలనలోనే మైనారిటీల సంక్షేమం

● టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన మసీదుల్లో రాజకీయాలు చేయకుండా ముస్లిం మైనారిటీలు చొరవచూపాలని.. చంద్రబాబు పాలనలోనే మైనారిటీల సంక్షేమమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక షాదీమహల్‌లో జరిగిన అంజుమన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభ్యర్థనతో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని సీఎం దృష్టికి తీసుకెళతానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు చేసింది ఏమిలేదని, కూటమి ప్రభుత్వం మౌజన్లు, ఇమామ్‌లకు వేతనాలు, రంజాన్ తోఫా, ఇతర కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. పుంగనూరు పరిధిలో మైనార్టీలకు చెందిన వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా ముందుండి కాపాడుతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు సయ్యద్‌సుహేల్ బాషా, ఇబ్రహీం, జఫ్రుల్లాఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, టీబీఎం జబీవుల్లా, సద్దాంహుస్సేన్, నదీంబాషా, 25 మసీదుల ముతవల్లీలు, ఇమామ్‌లు, ముస్లిం పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీలో ఉపయోగకర పనులు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఉపయోగకర పనులు చేపట్టాలని రామకుప్పం టీడీపీ మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. బుధవారం బందార్లపల్లె పంచాయతీ టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీల కోరిక మేరకు ప్రభుత్వం పని దినాలను 100 నుంచి 150 రోజులకు పెంచిందన్నారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఉద్యాన రైతుల పొలాల్లో ప్రభుత్వం పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సోమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఎంపీడీవో కార్యాలయానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

● రొంపిచెర్ల: మండలానికి 49 బీసీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 20న దరఖాస్తులు పరిశీలించి 21న లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

● పెద్దపంజాణి: స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21, 24వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

భార్యాపిల్లల దాడిలో గాయాలు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్న భార్య, పిల్లలు కలిసి చింతలవీధికి చెందిన భర్త అహ్మద్‌బాషాపై దాడి చేసి మంగళవారం అర్ధరాత్రి గాయపరిచారు. కట్టుకిందపాళ్యంలోని ఓ ఇంట్లో ఉండగా చితకబాదారు. గాయపడిన అహ్మద్‌బాషాను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మృతిచెందిన సంతోష్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో పుంగనూరుకు చెందిన ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ బసినేపల్లెకు చెందిన ఆదినారాయణ కుమారుడు సంతోష్ (14) పుంగనూరు బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రాక్టికల్స్ పూర్తి కావడంతో తన స్నేహితుడు సుదర్శన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కర్ణాటక రాష్ట్రం హెబ్బిణి ప్రాంతానికి వెళ్లి వస్తున్నారు. పెద్దపంజాణి మండలం కతార్లపల్లె సమీపంలోని సరిహద్దు ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా సుదర్శన్ గాయపడ్డాడు. గాయపడిన సుదర్శన్‌ను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి

వి.కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ దుర్గాప్రసాద్ కుమార్తె లక్ష్య చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఆదివారం సాయంత్రం ఆటలాడుతూ ఇంటి ముందు దీపానికి దుస్తులు తగిలి అగ్ని ప్రమాదానికి గురైన చిన్నారి లక్ష్య (5) గత మూడు రోజులుగా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఫయాజ్ బాషా

కుప్పం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్‌కు సహకరించాలని మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా, తహసీల్దారు చిట్టిబాబు వీఆర్వోలను కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సాగు భూమి కలిగిన ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. మొదట రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు తమ పేర్లను నమోదు చేసుకున్న తర్వాత వీఆర్వో, అనంతరం తహసీల్దారు లాగిన్లకు వెళ్తుందన్నారు. ఆయా వివరాలను పరిశీలించి ఆమోదించిన తర్వాతనే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం అర్హుడవుతాడని పేర్కొన్నారు. సాధ్యమైనంత వేగంగా పరిశీలన పూర్తి చేసి తమకు సహకరించాలని ఏవో కోరారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో వీఆర్వోలు, తహసీల్దార్లు లాగిన్ అయ్యే విధానాన్ని ఆయన వివరించారు. మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

● కుప్పం: విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కుప్పం మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా కోరారు. మండలంలోని నడిమూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం సాయంత్రం ఆయన రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో ఆయా గ్రామాల రైతులు తమ పేర్లను విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఎన్‌పీ జయప్రకాష్ తదితరులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో రైతులకు రాయితీపై గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేశారు. పశువైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలన్నారు. దాని అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం వారి చేతుల మీదుగా 31 మంది రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఎన్‌పీ ధరణీ, ఎన్‌పీ విక్రమ్, రైతుల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నేతాజీ నాయుడు, నీరజాక్షులు గౌడ్, జనార్ధన్‌గౌడ్, లోకనాథనాయుడు, జాకీర్‌హుస్సేన్, అధికారులు డాక్టర్ ఆసీఫ్, డాక్టర్ ఝాన్సీ, వైద్యసిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తగ్గువారిపల్లెకి చెందిన విద్యార్థి ఉమాపతి, కరిడివారిపల్లెకి చెందిన గౌతమ్‌ల భౌతిక దేహాలను బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మాజీ సీఎం జగన్ దళిత ద్రోహి: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డి దళిత ద్రోహి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు అరాచకవాదులంటే వల్లమాలిన ప్రేమ అని అన్నారు. సత్యవర్ధన్ అనే దళిత యువకుడిని కిడ్నాప్ చేసి, దౌర్జన్యం చేసి, తీవ్రంగా హింసించి తప్పుడు స్టేట్‌మెంట్ ఇప్పించి వేధించిన వల్లభనేని వంశీ అరెస్టు అయి జైల్లో ఉంటే అతడిని పరామర్శించడానికి వెళ్లారని కాని దాడికి గురైన దళిత యువకుడిని పరామర్శించకపోవడం విచారకరమని అన్నారు. వంశీ అమాయకుడని, ఆయనను ఎదగనీయకుండా చేయడానికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారనేవిధంగా జగన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ నేతలకు గుణపాఠం చెప్పినా ఇంకా వారు తమ తీరుమార్చుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. నేతలు మోహన్‌రాజ్, యువరాజులు తదితరులు పాల్గొన్నారు.

స్కై హోం ఫర్నిచర్ షోరూం ప్రారంభం



స్కై హోం ఫర్నిచర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్కై హోం మల్టీ బ్రాండెడ్ ఫర్నిచర్ అండ్ హోం నీడ్స్ షోరూంను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. బుధవారం నగరంలోని కట్టమంచిలో నూతన షోరూంను ఆయన ప్రారంభించారు. మదనపల్లెలో గత 20 ఏళ్లుగా నాణ్యమైన ఫర్నిచర్ విక్రయాల్లో అనుభవమున్న స్కై హోం ఫర్నిచర్ సంస్థ చిత్తూరులో నూతన షోరూంను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, స్కై హోం నిర్వాహకులు సుబ్రమణ్యం నాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసర్ సర్వే రిపోర్ట్ విడుదల



సర్వే రిపోర్టును విడుదల చేస్తున్న వినోద్‌భట్ తదితరులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యా ప్రవమాణాలపై ఆసర్ సంస్థ చేపట్టిన సర్వే రిపోర్టును చిత్తూరు అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వినోద్‌భట్ విడుదల చేశారు. అపోలో యూనివర్సిటీలో 2024 సంవత్సరానికి సంబంధించిన రిపోర్టును బుధవారం ఆసర్ ప్రతినిధులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఆసర్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ విద్యా ప్రమాణాలపై నిర్వహించే సర్వేలో ఆసర్ సర్వే అతిపెద్దదన్నారు. చిత్తూరు జిల్లాలోని 30 గ్రామాలను ఎంపిక చేసి అపోలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి ఈ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలున్నప్పటికీ బోధన చేసే ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నందున విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని అన్నారు. ఆసర్ ప్రతినిధులు సభామూర్తి, సురేష్‌కుమార్, సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ సమన్వయకర్త డాక్టర్ మహేందర్‌నాథ్ పాల్గొన్నారు.

లోకేష్‌కు స్వాగతం పలికిన భానుప్రకాష్



లోకేష్‌ను కలిసిన భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగే అంతర్జాతీయ దేవాలయాల సదస్సులో పాల్గొనడానికి బుధవారం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తిరుపతి విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ దేవాలయాల సదస్సులో ఆయనతో బాటు భానుప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సేవలందించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జిల్లా ప్రధాన ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తగుచర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డీసీహెచ్ఎస్, మెడికల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల పట్ల ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా ఆరోగ్యమిత్రలు స్పందించి బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. పేషెంట్ల నుంచి రుసుములు పొందినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ ప్రభావతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో ఇన్‌చార్జి నరేష్‌కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు, ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు


బంగారుపాళ్యం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని 65 కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన చిరంజీవి మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి అతడి వద్ద ఉన్న 14 ఆంధ్ర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా

- విద్యుత్ టవర్ ఎక్కి రైతు నిరసన
- మరొకరి పేరుతో పట్టా ఉందంటున్న రెవెన్యూ అధికారులు



విద్యుత్ టవర్ ఎక్కిన సుబ్రహ్మణ్యం

పెనుమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 132 కేవీ విద్యుత్ టవర్ ఎక్కి తనకు న్యాయం చేయకపోతే దూకి ఆత్మహత్య చేసుకుంటానని పెనుమూరు మండలం రాణా వేణుగోపాలపురానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యం బుధవారం నిరసన తెలిపాడు. తాను నిర్మించుకున్న షెడ్డును అదే గ్రామానికి చెందిన విజయలక్ష్మి పేరుతో పట్టా చేసుకున్నారని.. దానిని రద్దు చేసి తనకు పట్టా ఇవ్వాలని సుబ్రహ్మణ్యం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా మంగళవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఆ భూమిని పరిశీలించి, 2007లోనే విజయలక్ష్మికి పట్టా ఇచ్చారని.. అందులో షెడ్డు ఉందని గుర్తించి ఇరు పార్టీలకు నోటీసులు ఇచ్చి గ్రామసభ నిర్వహించి ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే బుధవారం సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ... తనకి న్యాయం జరగలేదని.. ఆత్మహత్య చేసుకుంటానని విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని చెప్పినా దిగకపోవడంతో ఫైర్ ఇంజన్‌ను రప్పించి ఎమ్మెల్యే థామస్ న్యాయం చేస్తామని చెప్పిన తరువాత దిగి వచ్చాడు. సుబ్రమణ్యం వడ్డెర సంఘం నాయకులతో మాట్లాడిన ఆడియో వైరల్ అవుతుంది. అందులో మంగళవారమే అందరికీ ఫోన్ చేసి.. 'నేను టవర్ ఎక్కి నిరసన చేస్తే కలెక్టర్ వస్తాడు.. ఎప్పుడో ఎవడో ఎమ్మార్వో పట్టా ఇచ్చేశాడు.. ఇప్పుడు ఉన్న ఎమ్మార్వో 15 రోజులు టైం ఇచ్చాడు.. మీరందరూ రావాలి.. కలెక్టర్‌ని ఇక్కడికే రప్పించాలి.. మన నాయకులందరికీ చెప్పాలి' అని చెప్పడం విశేషం.

సుబ్రహ్మణ్యానికి న్యాయం చేస్తాం

విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన సుబ్రమణ్యం తన అనుభవంలో ఉన్న భూమికి పట్టా ఇచ్చి న్యాయం చేస్తాం. విజయలక్ష్మి తనకున్న పట్టాను రద్దు చేసుకుంటామని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడితే వారి అనుభవంలో ఉంటే పట్టా ఇవ్వండని తెలిపారు. ఆ మేరకు సుబ్రమణ్యంకు పట్టా ఇచ్చేందుకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

రెండు లారీల సీజ్

- ఆరుగురిపై కేసు నమోదు

గుడిపాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గొల్లమడుగు వద్ద అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న రెండు ఇసుక లారీలను సీజ్‌చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు గొల్లమడుగు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చిత్తూరు నుంచి వేలూరు వైపు వెళుతున్న రెండు లారీల్లో ఇసుకను పట్టుకున్నామని, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా తమిళనాడుకు ఇసుక అక్రమంగా తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

తవణంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,600 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

వైభవంగా అధికార నంది, రావణబ్రహ్మ వాహన సేవలు



అధికార నంది వాహన సేవలో శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఉదయం అధికార నంది, సాయంత్రం రావణ బ్రహ్మ వాహన సేవలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా పుష్పపల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బజారు వీధి శివ షణ్ముగ సుందర వినాయక స్వామి ఆలయ కుంభాభిషేక వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వార్లకు ఆలయ నిర్వాహకులు వైభవంగా పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రత్యేక అతిథిగా పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం పుష్పపల్లకి సేవలో ఎమ్మెల్యే పాల్గొని రథం లాగారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి, అర్చకులు శ్రీధర్, కన్నన్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు వినతి పత్రాన్ని సమర్పించేందుకు ఆయన కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు ద్వారా వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయుసీ నాయకులు నాగరాజు, గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయ్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంబరాలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగకు ఇంకా నెలరోజులు ఉండగానే మసీదుల నిర్వహణ ఖర్చులతో పాటు ఇమామ్, మౌజన్‌లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయడంతో గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో పలువురు టీడీపీ ముస్లిం నేతలు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, మండల టీడీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ముర్తుజా, నేతలు అత్తాహర్‌అలీ, ఫెరోజ్‌అలీ, అలీఅబ్బాస్, జోహర్, మెహిది, మెహమ్మద్, ఇంతూ పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ పోస్టు ఓసీకే

వెదురుకుప్పం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చిన్నపోడుచేను అంగన్వాడీ వర్కర్ పోస్టును ఓసీ కేటగిరికి కేటాయించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద బుధవారం తెలిపారు. ఈ పోస్టును రోస్టరులో పొరపాటున ఎస్సీ అని ఇవ్వడం జరిగిందన్నారు. ఆ పోస్టు ఓసీకే అని స్పష్టం చేశారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కార్వేటినగరం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మొక్కుబడిగా యాదమరి

మండల సమావేశం

యాదమరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యాదమరి మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. మూడునెలలకు ఒకసారి ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చే మండల మీట్ బుధవారం ఉదయం చప్పగా ముగిసింది. ఎంపీపీ సురేష్ బాబు అధ్యక్షతన ఎంపీడీవో వేణు సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మండలంలో రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణ.. వలసల నివారణ.. పాడి రైతులకు పశుగ్రాసం తదితర సమస్యలను పరిష్కరించాల్సింది పోయి తూతూమంత్రంగా వివిధ శాఖల అధికారులు కాగితాలపై రాసుకొచ్చినవి చదివి వినిపించి మమ అనిపించారు. అర్హులైన రైతులకు క్యాటిల్ షెడ్లు మంజూరు చేయాలని, విద్యుత్ నియంత్రికలు ఏర్పాటులో ఆలస్యం చేయకుండా సమస్యలు పరిష్కరించాలని పలువురు సర్పంచ్‌లు ఈ సందర్భంగా కోరారు. మొత్తంగా సమావేశాన్ని గంటన్నరలో ముగించేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పార్థసారథి, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరినారాయణరెడ్డి, ఎంఈవోలు రుక్మిణిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషా, పీఆర్ ఏఈ కిశోర్, ఈవోపీఆర్డీ సుకుమార్‌రెడ్డి, ఏపీఎం ఈశ్వరి, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ గుర్రప్ప, వ్యవసాయశాఖ ఏవో చరిత,



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణు

సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి తెరపైకి ఆ 105 ఎకరాలు...?

యాదమరి మండలం సిద్ధారెడ్డిపల్లి పంచాయతీ ముద్దురామాపురం గ్రామానికి చెందిన 105 ఎకరాల భూమిపై హక్కులు మావంటే మావని అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పోటీపడుతున్నారు. దీనిపై బుధవారం మండలమీట్ సమావేశంలో మరోసారి తెరపైకి వచ్చింది. సమావేశంలో అటవీశాఖ అధికారులు 105 ఎకరాల భూమి విషయం తేల్చాలని, ఆ భూమి హక్కులు మావేనని తహసీల్దార్ పార్థసారథి దృష్టికి తీసుకెళ్ళారు. అక్కడే వున్న వైస్‌ఎంపీపీ హరినారాయణరెడ్డి సమస్యకు పరిష్కారం చూపాలని.. ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని అటవీ సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ... రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి గయ్యాళి పోరంబోకుగా ఉందన్నారు. సమస్యకు పరిష్కారం ఎన్నటికీ లభిస్తుందో వేచి చూడాలని చెప్పారు.



గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ మాదిరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్‌నేత ఇడమలపాటి భాస్కర్ నాయుడి కుమార్తె దివ్యకు, పాచిగుంటకు చెందిన టీడీపీ సీనియర్‌నేత పాదిలి కేశవులు నాయుడి కుమారుడు పూర్ణచందులకు చిత్తూరు నగరంలోని ఓ కల్యాణమండపంలో బుధవారం జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని కాబోయే వధూవరులకు పూలబొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్

- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళ పత్రాన్ని స్వీకరిస్తున్న గణపతి కుటుంబం

ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయ వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన కల్యాణ వెంకటగణపతి రూ.1,01,116 బుధవారం విరాళంగా అందించారు. అన్నవరం ఆలయ ఈవో సుబ్బారావు బుధవారం కాణిపాక వరసిదుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచల కిషోర్, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి.. వడ్డెర్లకు మధ్య వారధిగా పనిచేస్తా

- వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి



వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళిని సన్మానిస్తున్న సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి, వడ్డెర కులానికి మధ్య వారధిగా ఉండి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వడ్డెర్లకు అందే విధంగా పనిచేస్తానని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత బుధవారం తొలిసారిగా చిత్తూరులోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు రవిరాజు, దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, సంఘ నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. మురళి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రంలోని వడ్డెర కులస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, వారి ఆశలను వమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వడ్డెర కార్పొరేషన్ అధ్యక్షుడిగా పనిచేసి సీఎం చంద్రబాబు ఆశీస్సులతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుంచి అందే ప్రతి సంక్షేమ పథకం వడ్డెర్లకు అందేవిధంగా చూస్తానన్నారు. షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘ యువజన సంఘం అధ్యక్షుడు హరి, మహిళా అధ్యక్షురాలు కుసుమ, నేతలు రుద్రయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీపీఆర్‌ఎంఈఏ) చిత్తూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో చిత్తూరు పంచాయతీ సమితి యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎంజీ కుమార్, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా వినయ్, కోశాధికారిగా యశ్వంత్, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు-1 గా గిరిప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు-2 గా శ్రీనివాసులు ఎంపికయ్యారు. వీరిని ఏపీపీఆర్‌ఎంఈఏ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పాలసముద్రం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. వనదుర్గాపురంలో ప్రభుత్వ భూమిని తమిళనాడుకు చెందిన ఓ రైతు చదును చేయడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు బుధవారం సిబ్బందితో కలసి ఆమె పరిశీలించారు. ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా చదును చేసినా, మట్టిని అక్రమ రవాణా చేసినా తగు చర్యలు తీసుకుని పోలీసులతో కేసు నమోదు చేయిస్తామని ఆక్రమణ దారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గణేష్, వీఆర్వో వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుకాల్వకు మోక్షం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గత 15 సంవత్సరాలుగా మొగిలి రెవెన్యూ గ్రామంలోని తగ్గువారిపల్లె పంచాయతీలోని కొత్తపల్లె వద్ద మార్కానూరు పంట కాల్వ సాగుకు ఉద్దేశించిన కాల్వను ఆక్రమణదారులు పూడ్చివేశారు. దీంతో సీపీఎం ఆధ్వర్యంలో పలు మార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో బుధవారం తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ పోలీసుల సహకారంతో ఆక్రమణకు గురైన కాల్వను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కాల్వను సరిచేయించారు. నీరు సాగడానికి ఉన్న అవరోధాలు తొలగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఆరు గ్రామాలకు చెందిన రైతులకు పంట కాల్వ ఉపయోగంలోకి రానుంది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి శంకరన్, మండల కార్యదర్శి మురళీ, ఓబుల్‌రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మీ ఇల్లు భద్రత మీ చేతుల్లోనే

వెదురుకుప్పం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మీ ఇల్లు భద్రత మీ చేతుల్లోనే ఉందని కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. కార్వేటినగరం పోలీసుస్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాలు నేర నియంత్రణలో చాలా ప్రముఖమైనవన్నారు. ప్రస్తుతం రూ.2000కు సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలెవరైనా సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్న ఆసక్తి ఉంటే తనను పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్వేటినగరం మండలంలోని పలు గ్రామాల్లో పది సీసీకెమెరాలను అమర్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నలుగురి ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే)కు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చిత్తూరు జిల్లా నుండి కె.ఎం.అశోక్‌కుమార్, వై.కాళేశ్వర్‌రెడ్డి, వి.వెంకటాచలం, ఆర్.జయప్రకాష్ ఎంపికయ్యారని జిల్లా అధ్యక్షుడు లోకనాథం తెలిపారు.

మా పాఠశాలల్లో చదివే విద్యార్థులను వేపంజేరి హైస్కూల్లో కలపొద్దు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మా దళితవాడ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఇతర హైస్కూల్లో కలపరాదని గంగాధరనెల్లూరు పంచాయతీ కట్టకిందపల్లె దళితవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఎంఈవో ఆంజనేయులుశెట్టిని కలిసి విన్నవించారు. ఎస్ఎంసీ చైర్మన్ బాబు, మాట్లాడుతూ మా దళితవాడ నుండి వేపంజేరి హైస్కూల్ మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉందని, మా పిల్లలను వేపంజేరిలో మెర్జింగ్‌చేసిన పాఠశాలకు పంపించేది లేదన్నారు.

పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య స్థాపన కోసం మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి పోరాడి విజయం సాధించిన యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజేనని కొనియాడారు. బుధవారం స్థానిక వినాయకపురంలోని విద్యానికేతన్ పాఠశాలలో శివాజీ 559వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, షణ్ముగం, సురేష్, శ్రీనివాసన్, షేక్‌రెడ్డి మస్తాన్, ఓంకార్, గుణశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

తవణంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె రెవెన్యూ పరిధిలోని వెంగంపల్లెలో జరుగుతున్న భూసర్వేను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే వివరాలు అడిగి తెలుసుకొని.. భూముల వివరాలు మ్యాప్‌లో పరిశీలించారు. అనంతరం తవణంపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. తహసీల్దార్ సుధాకర్, డీటీ వెంకటరమణ, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పందెం రాయుళ్లకు అపరాధ రుసుం

నగరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని బీరకుప్పం చెరువు కట్టపై కోడిపందేలు ఆడుతున్న 12 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లను, రూ.1000 నగదు స్వాధీనం చేసుకుని బుధవారం నగరి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. విచారించిన కోర్టు మేజిస్ట్రేట్ పందెం రాయుళ్లకు అపరాధ రుసుం విధించినట్లు పోలీసులు చెప్పారు.

చెరువులకు వేలం

నింద్ర, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 చెరువులకు గాను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన చేపల చెరువుల వేలం పాట ద్వారా రూ.80 వేలు ఆదాయం వచ్చిందని మత్స్య శాఖాధికారి రామ్మోహన్ తెలిపారు. మొత్తం 12 చెరువులకు గాను ఓరూరుపేటకు రూ.10,658, కచ్చరవేడుకు రూ.4,503, ఆరూరుకు రూ.9,212, కొడియంబేడుకు రూ.14,817, అగరంకు రూ.15,646, కైపాకంకు రూ.5,060, కేఆర్‌పాలెంకు రూ.7,696, నట్టేరికి రూ.12,401 చొప్పున పాట జరిగిందన్నారు. మిగిలిన నాలుగు చెరువులైన కొప్పేడు, కీలంబాకం, సోమేశ్వరం, ఇరుగువాయిలకు వేలంపాట జరగలేదన్నారు.

గందరగోళంగా మండల సమావేశం

విజయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జమున అధ్యక్షతన జరిగింది. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారు అంటూ పన్నూరు దళితవాడ సర్పంచ్ కుమార్ పంచాయతీ రాజ్ ఏఈపై ధ్వజమెత్తారు. గ్రామంలో అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని.. మాకు తెలియజేసి అభివృద్ధి చేయాలని, లేదంటే కోర్టును ఆశ్రయించాలని కోరారు. మండలంలో గోకులం షెడ్లు 51 మంజూరైతే సర్పంచ్‌కు సమాచారం లేకుండానే పనులు చేస్తున్నారని, సర్పంచ్‌లు ఎల్లప్పుడు అభివృద్ధినే కోరుకుంటారని తెలిపారు. విజయపురం దళితవాడలో నెల రోజులుగా ఉపాధి పనులు నిర్వహించడం లేదని, పంచాయతీ తీర్మానం లేకుండా క్షేత్ర సహాయకులను మార్చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు టీడీపీకి ఏకపక్షంగా పనులు చేస్తున్నారని బూచివానత్తం ఎంపీటీసీ రాజగోపాల్ ఆరోపించారు. కోసలనగరం ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని



సమావేశంలో సమస్యలపై సమీక్షిస్తున్న అధికారులు

కోరారు. సర్వసభ్య సమావేశానికి భార్యలకు బదులు భర్తలు రావడం వలన సమస్య ఉత్పన్నమౌతుందని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. వైస్‌ఎంపీపీ బాలాజీ, జడ్పీటీసీ రేవతి, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఏవో రజనీకుమారి, ఏంఈవో హరిప్రసాద్‌వర్మ, పీఆర్‌ఏఈఈ వీరభద్రం, వైద్యాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు. ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.